

(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)

2023-జూలై

భార్గవ్ మనసు అతను నడుపుతున్న బైక్ కంటే వెగంగా పరిగెడుతోంది. మనసుకి రెక్కలేవో మొలిచినట్టు, ఒళ్ళంతా ఉత్సాహం పరవళ్ళు తొక్కుతూ, అతనికి చెప్పలేనంత సంతోషంగా వుంది.

తనకి ఇరవై నాలుగేళ్ళు! ఇరవై నాలుగు! ఎంత బాగుందీ వయసు! ఒక చేత్తో బైక్ హేండిల్ బార్ పట్టుకోని, ఇంకో చేత్తో హెల్మెట్ సవరించుకున్నాడు. అమ్మనీ, నాన్ననీ డబ్బు అడిగే పరిస్థితి నుంచి తప్పించుకున్నట్టే వుంది. కిందటి యేడంతా వీడియో ఎడిటింగూ, షార్ట్ ఫిల్మ్‌లూ, ఎంత చేసినా డబ్బు చాలేది కాదు. పెట్రోల్ కోసం నాన్నని డబ్బు అడగాలంటే చచ్చే చావుగా అనిపించేది. కానీ ఇప్పుడు!

అతని జేబులో ఫోన్ మోగింది. అప్రయత్నంగా చిన్న నవ్వు నవ్వాడు. ఆ ఫోన్ ఎక్కణ్ణించో అతనికి తెలుసు! సుధీర్! తన బ్రతుకునొక మలుపు తిప్పిన స్నేహితుడు. అతనికింకా గుర్తుంది– ఈ యేడు మొదట్లో తను సుధీర్‌ని కలిసిన ఆ రోజు!

★★★★★★★★★

కాలింగ్ బెల్లు మోగించి నిలబడ్డాడు భార్గవ్. ఖరీదైన పైజామాలో, నిద్ర కళ్ళతో తలుపు తెరిచాడు సుధీర్.

"హేయ్, భార్గవ్! కమిన్, మాన్!" తలుపు పూర్తిగా తెరిచి లోపలికి దారి తీసాడు.

"మేక్ యువర్‌సెల్ఫ్ కంఫర్టబుల్. విల్ బి విత్ యూ ఇన్ ఎ సెక్!" బెడ్ రూములోకి వెళ్ళిపోయాడు.

సోఫాలో కూర్చుంటూ అపార్ట్‌మెంటంతా పరికించి చూసాడు భార్గవ్. చిన్నగా వున్నా, అడుగడుగునా అట్టహాసంగా వుంది. కింద ఖరీదైన కార్పెట్టూ, తలుపు దగ్గర అందంగా చిన్నగా వున్న బల్లా, దాని పైనున్నఇంకా ఖరీదైన విగ్రహమూ, గోడంతా నిండిపోయినట్టున్న టీవీ!

మూడు రోజుల క్రితం జరిగిన న్యూ పార్టీ ఆనవాళ్ళింకా వున్నాయి. కర్టెన్ రాడ్ పట్టుకొని వేళ్ళాడుతూ వున్న స్ట్రీమర్లూ, వంటింటి సింకులోంచి కనపడుతున్న మద్యం సీసాలూ, ఒక పక్కగా చిన్న అందమైన పింగాణీ పాత్రలో వెలవెలా

పోతున్న వేరు సెనగ పప్పులూ, ఇంకా కొత్త సంవత్సరానికి స్వాగతం చెప్పుతూనే వున్నట్టున్నాయి. టవల్‌తో మొహం తుడుచుకుంటూ బయటికొచ్చాడు సుధీర్.

"సో, వీడియో ఎడిటింగ్ అయిపోయిందన్నమాట. నువ్వు చాలా స్మార్ట్ అని శశాంక్ అంటే ఏమో అనుకున్నాను. చాలా తొందరగా చేసావే! వాట్ విల్ యూ హావ్? కాఫీ?"

నవ్వాడు భార్గవ్.

"అవునండీ. ఇంకా చాలా ఎడిటింగ్ జాబ్స్ వున్నాయి. అన్నీ పైల్ అవుతాయని, ఒకదాని తరవాత ఇంకొకటి గబగబా చేసుకుంటున్నాను. మీరు చూసి ఓకే చేస్తే, ఇంకొన్ని కాపీస్ చేసి మీ ఫ్రెండ్స్‌కి కూడా ఇస్తాను."

"ష్యూర్! బై ద వే, నన్ను మీరు, అండీ, అనక్కర్లేదు. సుధీర్ ఈజ్ ఇనఫ్!", నవ్వుతూ అన్నాడు సుధీర్. అతని ఫ్రెండ్లీ నేచర్‌కి చాలా ఇంప్రెస్ అయిపోయాడు భార్గవ్. ఎడిట్ చేసిన వీడియో వున్న పెన్ డ్రైవ్ తీసి టేబిల్ మీద పెట్టాడు. సుధీర్ లేచి పెన్ డ్రైవ్ తన లాప్‌టాప్ లో పెట్టి, లాప్‌టాప్ టీవీకి కనెక్ట్ చేసి, ఆన్ చేసాడు.

"కొంచెం కాఫీ తెస్తా భార్గవ్!" అంటూ లోపలికెళ్ళి అయిదు నిమిషాల్లో వేడి కాఫీ మగ్గులు తెచ్చాడు.

"నాకంటే మహా అయితే అయిదారేళ్ళు పెద్దవాడేమో, అయినా అతని ప్రతి కదలికలో ఎంత కాంఫిడెన్స్," అనుకున్నాడు భార్గవ్.

రెండు మూడు నిమిషాలు వీడియో చూసాడు సుధీర్.

"చాలా బాగుంది భార్గవ్!"

భార్గవ్ మొహం సంతోషంతో విచ్చుకుంది.

"మీకు మ్యూజిక్ నచ్చిందా? కొంచెం అన్–కన్వెన్షనల్ మ్యూజిక్ వాడాను."

"చాలా బాగుంది. నాకు మ్యూజిక్ పెద్దగా తెలియదు. కానీ పార్టీ మూడ్ చాలా బాగా తెచ్చావు." లేచి లాప్‌టాప్ మూసేసాడు సుధీర్.

కాళీ కప్పు తీసుకొని లోపలికెళ్ళాడు సుధీర్. తన కప్పూ తీసుకొని వెనకే వెళ్ళాడు భార్గవ్. చిన్నగా శుభ్రంగా వున్న కిచెన్లో ఇంకో టీవీలో క్రికెట్ మాచ్ వస్తూ వుంది.

"క్రికెట్ ఫాలో అవుతావా భార్గవ్?"

"అఫ్ కోర్స్!"

"ఐ పీ యేల్?"

"తప్పకుండా!"

"యెవరు నీ ఫేవరిట్ టీం?"

"ఆర్‌సీబీ! కోహ్లీ ఇస్ మై గాడ్!"

అతని అమాయకమైన ఉత్సాహం చూసి నవ్వాడు సుధీర్.

అక్కడ టీవీ కట్టేసి మళ్ళీ బయటికొచ్చి కూర్చున్నారు.

"ఇంతకీ ఈ ఎడిటింగ్ చేసినందుకు ఎంత తీసుకుంటావు నువ్వు?"

భార్గవ్ చెప్పాడు.

"అంత తక్కువా? ఎన్ని రోజులు పడుతుంది ఒక రికార్డింగ్ మొత్తం ఎడిట్ చేసి ఫైనల్ కాపీ తయారు చేయడానికి?"

"దాదాపు మూడు రోజులు పడుతుంది."

"మూడు రోజుల పనికి నువ్వు తీసుకునేదింతేనా? ఇంకెక్కువ చార్జి చేయలి నువ్వు!"

"ఇంక ఎక్కువ చార్జ్ చేస్తే ఎవరూ రారండి!"

"పోనీ, ఇంకేదైనా బిజినెస్ చూసుకో."

"ఇంకేదైనా అంటే, పెద్దగా పెట్టుబడి లేదండి, నా దగ్గర," కొంచెం ఇబ్బందిగా అన్నాడు.

"నాన్సెన్స్! ఇరవై యేళ్ళ యంగ్ మాన్‌వి. సినిమాల పైన ఆసక్తి వున్నవాడివి. తెలివైనవాడివి, క్రికెట్ ఫాలో అవుతున్నావు. చేతిలో లేప్‌టాప్ వుంది. బిజినెస్ చేయడానికి ఇంకేం కావాలి. పోనీ, బిజినెస్ అంత పెద్ద మాటొద్దు. తొందరగా డబ్బు సంపాదించుకునే మార్గం అను."

అతను చెప్తున్నదేమిటో భార్గవ్‌కి అంత బాగా అర్థం కావడంలేదు కానీ, ఏదో తెలియని ఉద్వేగంతో గుండె వేగంగా కొట్టుకుంది.

"నిజంగా మీరంటున్నదేమిటో నాకు సరిగ్గా అర్థం కావడంలేదండీ!"

సుధీర్ తన ఫోన్ చేతిలోకి తీసుకున్నాడు.

"మనీ గేమింగ్ గురించి విన్నావా?"

"అంటే డ్రీం లెవెన్ గురించి విన్నాను కానీ ఎప్పుడూ వాడలేదు."

"డ్రీం లెవెన్ చిన్న పిల్లల ప్లాట్‌ఫార్మ్. ఇంకా ఎక్కువ స్టేక్‌లతో ఆడే ఫేంటసీ ప్లాట్‌ఫారంస్ చాలా వున్నాయి. అసలు కొన్నైతే ప్లే స్టోర్‌లో కూడా కనిపించవు."

"అవునా? మరి అలాటి ప్లాట్‌ఫారంస్, యాప్‌లూ ఇల్లీగల్ కాదా? వాటిని ఎలా డౌన్ లోడ్ చేయటం?"

"ఓ మాన్! యూ ఆర్ టూ ఇన్నొసెంట్. ఇలా రా, నేను చూపిస్తాను.”

సుధీర్ డైనింగ్ టేబుల్ దగ్గరికి నడిచాడు. భార్గవ్‌ని తన పక్కనే కూర్చోమని సైగ చేస్తూ తన ఐ–ఫోన్ తెరిచాడు.

"గేమింగ్ విషయాల్లో ఒక్కొక్క రాష్ట్రానిదీ ఒక్కో వైఖరి. తెలంగాణలో రూల్స్ కొంచెం స్ట్రిక్టేననుకో! అయినా, పర్లేదు. చాలానే ఆప్షన్స్ వున్నాయి, కొంచెం రిస్కు తీసుకోగలిగితే!"

భార్గవ్ ఏదో అడగబోయాడు కానీ, ఇంతలో సుధీర్ ఫోన్ పైన స్క్రీన్ తెరుచుకుంది. స్క్రీన్ పైనంతా ఎవేవో నెంబర్లు, క్రికెట్ మాచ్ వివరాలు, ఆటగాళ్ళ వివరాలూ గజిబిజిగా పరుచుకోని వున్నాయి.

"ఇంతకీ ఈ గేమింగ్ ఆప్‌లో మనమేం చేయాలి?" కుతూహలంగా అడిగాడు.

"అదే చెప్తున్నా! ఏమీ చేయక్కర్లేదు. పందెం కాయాలి, ఏదో ఒక టీం పైనో, ఆటగాడి మీదో, మాచ్ ఫలితం మీదో! ఎండ్ దెన్ వాచ్."

"అంటే గాంబ్లింగా?" ఆశ్చర్యంగా అడిగాడు భార్గవ్.

"ఇది గాంబ్లింగ్ ఎలా అవుతుంది? మనమేం గుడ్డిగా పందెం కాయం కదా? ఆటగాళ్ళ వివరాలూ, వాళ్ళు ఆడిన ఇతర మాచిల ఫలితాలూ, స్టేటిస్టిక్సూ, మైదానం వివరాలూ, వాతావరణం వివరాలూ, ఇన్నిటిని కన్సిడర్ చేస్తూ మన మనసు చెప్పిన ఫలితం ప్రెడిక్ట్ చేస్తాం, అంతే! ఇట్ ఈజ్ ఎ సైంటిఫిక్ ప్రొసెస్!"

"స్టాటిస్టిక్సూ", "సైంటిఫిక్" అన్న పదాలు వినబడగానే భార్గవ్ మనసులో వున్న ఆందోళనా, విముఖత్వం కొంచెం తగ్గాయి.

"విషయమేంటంటే, మిగతా ప్రపంచం కంటే మనకి కొన్ని వివరాలు ఎక్కువ తెలుసు. అది మన తప్పు కాదు కదా? అలా తెలవడాన్ని మనం చొరవగా కేష్ చేసుకుంటున్నామంతే!" సుధీర్ మాటలకి అతని మనసు ఇంకా మెత్తబడింది.

"నేనూ పందెం కాయనా?"

"అఫ్ కోర్స్. నీకొక అక్కవుంట్ క్రియేట్ చేస్తే చాలు. నీకు వీలైనప్పుడల్లా పెట్టుబడి పెట్టు. ప్రస్తుతం నీకొరకు నేను ఒక అయిదువందలు నా అక్కవుంట్లోంచి పెడతాను. సరేనా?"

"అయిదు వందలా? వొద్దు, హండ్రెడ్ చాలు."

నవ్వాడు సుధీర్.

"అలాగే. ఇదిగో, హండ్రెడ్ ఇన్వెస్టెడ్. ఇది ఐపీయెల్ మాచ్ కాదు. చిన్న ఈవెంట్. ఆట అయిపోవస్తుంది కూడా," చెప్తూనే వంద రూపాయలు ఒక ఆటలో పెట్టాడు.

"రా, ఈ ఆట అయిపోయేలోగా మనం ఇంకో మంచి టీ చేసుకుందాం."

"మరి మన డబ్బుకేమైందీ ఎప్పుడు తెలుస్తుంది?" భార్గవ్ ఆరాటంగా అడిగాడు.

"పదే పది నిమిషాలు," లోపలికెళ్తూ అన్నాడు సుధీర్. పది నిమిషాలు దుర్భరంగా గడిచాయి భార్గవ్‌కి. సుధీర్ తెచ్చిన టీ కప్పుని చేతిలో పట్టుకొని ఆడిస్తూ కూర్చున్నాడు. ఈలోగా సుధీర్ స్నానం కూడా ముగించి బాత్రూంలోంచి బయటికొచ్చాడు. రాగానే ఫోన్ తెరిచి చూసాడు. కెవ్వుమన్నాడు.

"భార్గవ్! యూ లక్కీ గై! నీ వంద రూపాయలు రెండు వందలయ్యాయి!"

"వాట్, అప్పుడేనా?"

"యస్!అదే నేననేది. కుర్చీలో కూర్చొని సరిగ్గా కేలిక్యులేట్ చేసి పెట్టుబడి పెడితే చాలు."

"ఒక్క క్రికెట్టేనా? ఇంకా ఏవైనా ఆటలూ వున్నాయా?"భార్గవ్ కుతూహలంగా అడిగాడు.

"ఓ, లేకేం, చాలానే వున్నాయి. వాలీబాల్, బాస్కెట్ బాల్, బాడ్‌మింటన్."

"నాకు బాడ్మింటన్ బాగా తెలుసు. మా అమ్మ స్టేట్ లెవెల్ ప్లేయర్, దాదాపు ట్వెంటీ ఫైవ్ ఇయర్స్ ఎగో!" గర్వం తొంగి చూసిందతడి మాటల్లో.

"రియల్లీ? దట్ ఈజ్ గ్రేట్. నీకు ఇంకా సులువు!"

ఒక్క క్షణం భార్గవ్ మనసులో తండ్రి గుర్తొచ్చింది. కళ్ళద్దాలతో అమాయకంగా, పుస్తకాలలోనే ప్రపంచమంతా వుందనుకునే తండ్రి, డబ్బన్నది అసలు పెద్దగా ఆలోచించాల్సిన విషయమే కదన్నట్టు అలౌకికంగా వుండే తండ్రి, ఆయనకి తను డబ్బు కోసం పందాలు కాస్తున్న సంగతి తెలిస్తే తట్టుకోగలడా?

కానీ, తను జూదగాడు కాదు. ఏదో గుడ్డిగా అదృష్టాన్ని నమ్మి పందాలు కాయటంలేదు. తనకి తెలిసిన విషయాలని జాగ్రత్తగా ఎనలైజ్ చేసి కాబోయే దాన్ని ప్రెడిక్ట్ చేస్తున్నాడంతే! ఎంతో మందికిలానే మాయమాటలు చెప్పి మురిపించే మనసు అతనికీ వుంది.

★★★★★★★★★★★★★★★★★★★

ఆ తరవాత కిందటి ఆరు నెలల్లోనూ తను బాగానే డబ్బు సంపాదించుకున్నాడు. ఎక్కువ ఆశపడకుండా, చిన్న చిన్న మొత్తాలు పెడుతూ, ఒకటి రెండు సార్లు డబ్బు పోగొట్టుకోగానే భయపడుతూ, బానే నెట్టుకొస్తున్నాడు. ఇంట్లో అమ్మా–నాన్నలు మాత్రం తన వీడియో ఎడిటింగ్, షార్ట్ ఫిల్ముల బిజినెస్ బాగానే నడుస్తుందనుకొని సమాధాన పడ్డారు. ఎప్పుడూ తనని గుచ్చి గుచ్చి యే ప్రశ్నలూ అడగలేదు.

తను యెప్పుడూ కాఫీ తాగే రెస్టరెంటు దగ్గర బైక్ ఆపి లోపలికెళ్ళి మూలనున్న టేబుల్ దగ్గర కూర్చున్నాడు. ఇక్కడైతే యే డిస్టర్బెన్సూ వుండదు. లేప్‌టాప్ తెరిచి ఆప్ లోకి లాగిన్ చేసాడు. ఈ లోగా ఫోన్ తెరిచి సుధీర్ పంపిన మెసేజీ చుసుకున్నాడు.

తన బాంక్ అక్కవుంట్లోకి లాగిన్ చేసి డబ్బులు చూసుకున్నాడు. పరవాలేదు, ఆరునెలలుగా దాదాపు నెలకి పాతికవేలపైనే సంపాదించాడు. పెద్ద కష్టపడకుండానే. ఎన్నెన్ని రోజులు వీడియో ఎడిటింగ్ చేస్తే అంత సంపాదించగలడు? షార్ట్ ఫిల్మ్‌లు మాత్రం? ఏదో తన ఆసక్తి కొద్దీ చేయటమే కానీ, చేసి యూట్యూబులో అప్–లోడ్ చేసిన దగ్గరనుంచీ ఆందోళనే. ఈ గేమింగ్ ఆప్ సంపాదన హాయిగా వుంది. ఎవరి అభిప్రాయాలతోటి పని లేదు. ఇక్కడ ఈ రెస్టరెంటులో ప్రశాంతంగా కూర్చుని కాసేపు తన బుర్రకి పని చెప్తే చాలు. తనకి తేలిగ్గా తెలిసిపోతుంది, యే ఆటలో యే టీం నెగ్గుతుందో. సింపుల్!

★★★★★★★★★★★★★★★

"మనం ఇక్కడ లంచి కొచ్చిన ప్రతీ సారీ, మినర్వా ఎంత మారిపోయిందో, అనుకుంటాం కదా?" భాను కోసం ఎదురు చూస్తూ కూర్చున్నారు ఆశా, కోమలీ.

"మినర్వా అనే కాదు, అసలు హైదరాబాదు యెంత మారిపోయింది! మనం జే ఎన్ టీ యూ లో చదువుకునేటప్పుడు, మా అమ్మా నాన్న, అరవైల్లో హైదరాబదు యెంత బాగుండెదో చెప్పి చెప్పి చంపేవాళ్ళు. ఇప్పుడు మనమూ అదే పాట పాడుతున్నాం కదా?" ఆశా నవ్వింది.

"అదిగో, భాను! ఇవాళ సూసీ రానంది. మనం ముగ్గురమే."

"హలో గర్ల్స్!" భాను ఆయాసంగా కూర్చుంటూ అంది.

"ఆయాసపడుతున్నావే భానూ? ఆర్ యూ ఆల్రైట్?"

"యేమోనే! నాలుగైదు నెలలుగా మోకాళ్ళు బాగా నొప్పెడుతున్నాయి. డాక్టరుకి చూపించుకుంటున్నా. లక్ష కారణాలు చెప్తారు వాళ్ళు. ఒక్కటీ అర్థమై చావదు నాకు. ఆకలి! ఆకలి! ఆర్డర్ చేసారా?"

"నీకు మసాలా దోస, ఎప్పటిలానే. ముందు కొంచెం సూప్ తాగుదామా?"

"సూసీ యేది?"

"ఇవాళ యేదో పనుందట, రానంది!"

"రాకపోవడమే మంచిదేమోలే," భాను మాటలకి ఇద్దరూ ఆశ్చర్యంగా చూసారు.

"అదేంటి భానూ? అలాగన్నావు."

"ఇవాళ నేను మీ ఇద్దరితో ఒక విషయం చెప్పాలి. సూసీ యెదురుగా ఆ విషయం మాట్లాడడం ఇబ్బందేమో అనిపించి.." భాను ఆగి మంచి నీళ్ళు తాగింది.

"యేమయింది భానూ? ఇంట్లో అంతా ఓకేనా?" ఆశా అనునయంగా అడిగేసరికి భానుకి దుఃఖం వచ్చినట్టయింది.

"అంతా ఓకేనేలే. పిల్లలు పెద్దవాళ్ళవుతూ వుండడంతో ఏవో చికాకులు."

వెయిటర్ వాళ్ళ భోజనం తీసుకురావడంతో మాటలాపి తినడం మొదలు పెట్టారు.

"పిల్లల సంగతి చెప్పకే భాను. మా పిల్లదైతే ఫెవికాల్‌తో చెవులకి మొబైల్ ఫోన్ అంటించేసుకుందేమోనని అనుమానం వొస్తుంది నాకు. ఎప్పుడైనా దాని చేతిలోంచి ఫోన్ తీస్తే, పిచ్చి చూపులు కూడా చూస్తుంది!" ఆశ మాటలకి నవ్వుకున్నారు.

"భార్గవ్ ఎలా వున్నాడు? ఇంకా సినిమాలు తీస్తున్నాడా?"

"బానే వున్నాడు. అయితే ఈ మధ్య సినిమాల గురించి ఎక్కువ మాట్లాడడం లేదు. వీడియో ఎడిటింగ్ బిజినెస్‌లో ప్రయత్నాలు చేస్తున్నాడు. చుట్టూ వున్న మనుషులకి బరువు కాకుండా, ఇల్లీగల్ వ్యవహారాలు పెట్టుకోకుండా తన కాళ్ళ మీద తాను నిలబడితే చాలు అనుకుంటున్నాం."

"ప్రొఫెసర్ గారేమంటున్నారు?"

"యేమంటారు? కళ్ళద్దాల్లోంచి కళ్ళెత్తి పైకి చూస్తారు. యే మాటా చెప్పకుండా ఆలోచనల్లో కూరుకుపోతారు." ముగ్గురూ మళ్ళీ నవ్వుకున్నారు.

"అశోక్ చాలా మంచి వాడూ, అమాయకుడూ!"

"సరే నమ్మా, నేనే గయ్యాళి దాన్ని, సరేనా? మీ అశోకూ మంచివాడే, ఆయన కన్న పిల్లలంతకన్నా మంచి వాళ్ళే! నేనే రాక్షసిని!"

"అమ్మో, భానూ! చాలా కోపంగా వున్నావే! అది సరే, టీ తాగుదామా?" వెయిటర్‌ని పిలిచి ఇంకో టీ తెమ్మని పురమాయించింది కోమలి.

"అది కాదే, ఆశా! మా అనఘకి ఇరవై ఒకటి. ఇంకా చదువే సరిగ్గా పూర్తికాలేదు. మధ్యలో కోవిడ్ గోలతో వొచ్చే ఆ నాలుగక్షరాలూ ఏమీ వొంటబట్టలేదు. బీయేస్సీ, ఆపైన ఎమ్మెస్సీ చదివి ఏదో వుద్ధరిస్తుందనుకుంటే," దిగులుగా పెదవి విరిచింది భాను.

"ఇంతకీ విషయం చెప్తావా చెప్పవా?" విసుక్కుంది కోమలి.

"షీ ఈజ్ సీయింగ్ సంవన్." భాను మాటలకి తేలిగ్గా నిట్టూర్చింది ఆశా.

"అబ్బా, ఇంతేనా! నేనింకా ఎంత పెద్ద సమస్యోనని భయపడి చచ్చాను. ఇంతకీ ఎవరా అబ్బాయి? మీకు పరిచయం చేసిందా?"

"ఆ, మొన్న దీపావళి పండగ తరవాత ఒక రోజు డిన్నర్‌కి తీసుకొచ్చింది."

"మరి సమస్యేమిటే? దానికిష్టమైన చదువేదో పూర్తి కాగానే పెళ్ళి చేసెయ్యండి. అతని కుటుంబాన్ని కలిసావా?"

"ఇప్పుడప్పుడే పెళ్ళొద్దట. ఇంకో రెండు మూడేళ్ళైనా ఆగుతారట. ఇంతకీ, అతను ముస్లిముల అబ్బాయి."

మిగతా ఇద్దరూ యేమీ మాట్లాడలేదు ఒక నిమిషం.

"చెప్పండే, యేమీ మాట్లడరేమిటి?"

ఆశా నిట్టూర్చింది.

"యేం చదువుకున్నాడు? ఉద్యోగం?కుటుంబం? చూట్టానికెలా వున్నాడు?"

"చూట్టానికి చాలా బాగున్నాడు. గ్రాడ్యుయేషన్ చేసి తండ్రి బిజినెస్ చూసుకుంటున్నాడు. మంచి కుటుంబంలానే వున్నాడు. నిజాయితీగా చెప్పాలంటే చక్కటి కుర్రాడు!"

"అయితే సమస్యే!" కోమలి మాటలకి భాను తలెత్తి ఆమె వైపు చూసింది.

"అవునా? మంచి కుర్రాడైతే సమస్యేమిటి?"

"మంచి కుర్రాడైతే అనూకి యే వంక చెప్పి వొద్దంటావు?"

"కోమలీ! మంచి కుర్రాడు నా బిడ్డని ఇష్టపడితే నాకు సంతోషమే! కానీ, యేదో ఆందోళనగా అనిపిస్తూ వుంది. యేం నిర్ణయించుకోవాలో, ఎవరినైనా సలహా అడగాలో యేమీ అర్థం కావడం లేదు."

ఆశా భాను చేయి తట్టింది అనునయంగా!

"అశోక్ యేమాలోచిస్తున్నాడో చెప్పడు. భార్గవ్ తన ప్రపంచంలో తానుంటాడు. అనూ నన్ను శత్రువులా చూస్తుంది. నాకెంత ఒంటారిగా అనిపిస్తూ వుందో చెప్పలేను," భాను కళ్ళు తుడుచుకొంది.

"సరే, వన్ థింగ్ ఎట్ ఎ టైం! నీకు ఆ అబ్బాయి నచ్చాడా?"

"అదే నాకూ అర్థం కావడంలేదు. మన జెనరేషన్‌లో నేనూ చాలా ఆధునికంగా ఆలోచించినదాన్నే. అమ్మా–నాన్నలతో దెబ్బలాడి, వాదించి, మరీ నాకు నచ్చినవాణ్ణి, కులాంతర వివాహం చేసుకున్నాను. చేసుకున్నందుకు బాధపడే సందర్భం ఎప్పుడు రాలేదు. ఇప్పుడు నాలో ఈ బలహీనత, భయం ఏమిటి? మతాంతర వివాహం అంటే ఇంత అయిష్టం వున్న నేను సూసీకీ శివాకీ పెళ్ళి జరిపించడంలో ముందుకెలా వచ్చాను? లేక నేనేమైనా మారిపోయానా? చాలా కన్‌ఫ్యూజింగ్‌గా కూడా వుంది. వాట్ డు ఐ డూ?"

"ప్రస్తుతానికైతే, నథింగ్! ముస్లిం అబ్బాయితో పెళ్ళి అంటే, నువ్వు కేవలం మతాంతరం అన్న సమస్య కంటే, ప్రస్తుతం దేశంలో, ప్రపంచంలో వున్న రాజకీయ ఆర్థిక పరిస్థితుల గురించి వర్రీ అవుతున్నావేమో! సో, కొన్ని రోజులు ఓపిక పట్టు. నీకే అంతా క్లియర్ అవుతుంది. నిజంగా మంచి కుర్రాడే అయితే, సమస్యే లేదు. యూ రిలాక్స్!"

"అశోక్ కూడా అలాగే అన్నాడు. కొన్ని రోజులు వాళ్ళని ఆలోచించుకోనీ, అని. కానీ.."

"చూడు భానూ! కడుపున పుట్టిన పిల్లలైనా, మనం వాళ్ళ బ్రతుకులని కొంతవరకే కంట్రోల్ చేయగలుగుతాం. మిగతాది వొదిలేసి, వీలైనంత వరకూ ప్రశాంతంగా వుండడమే, మనం చేయవలసింది."

"అవును, మా అమ్మా నా పెళ్ళి విషయంలో బాధ పడీ, పడీ, చివరికి వొదిలేసింది," కోమలి మాటల్లో బాధ వున్నా పశ్చాత్తాపం లేదు.

"నువ్వు ఎక్కువ టెన్షన్ పడి ఆరోగ్యం మీదకు తెచ్చుకోకు భానూ! అంతా సర్దుకుంటుంది. నీకెప్పుడు దిగులనిపించినా నాకో, కోమలికో ఫోన్ చేయి!" ఆశా మాటలకి కళ్ళూ,మనసూ తడి అయ్యాయి భానుకి.

★★★★★★★★★★

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS